సాక్షి
చిత్తూరు
మంగళవారం ♦ 14 ♦ మార్చి ♦ 2023



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.53,000
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,200
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.65,000
రిటైల్ వెండి గ్రాము రూ.67.00

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	21
తిరుపతి	37	21
తిరుమల	32	16
గూడూరు	36	22
నగరి	37	22



మృత్యుంజయునికి విశేష పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ స్వామికి సోమవారం విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

తూర్పు రాయలసీమ పరిధిలో పకడ్బందీ పోలింగ్

- గాడ్యుయేట్లు : 65.28..
- టీచర్లు : 84.92శాతం


చిత్తూరులోని పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేసీ వెంకటేశ్వర్


ఓటేసిన డీఆర్‌ఓ రాజశేఖర్

సాక్షి, చిత్తూరు : తూర్పు రాయలసీమ పరిధిలోని ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 నుంచి ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. గడువు సమయంలోపు క్యూలో ఉన్నవారికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. తూర్పు రాయలసీమ పరిధిలో ఉదయం 10 గంటలకు టీచర్‌ల పోలింగ్ 20.72 శాతం నమోదైంది. అప్పటి వరకు 10.51శాతంతో మందకొడిగా సాగిన పట్టభద్రుల పోలింగ్ తర్వాత పుంజుకుంది. 12 గంటలకు గ్రాడ్యుయేట్ల పోలింగ్ 26.06 శాతం, టీచర్ పోలింగ్ 43.94 శాతానికి చేరుకుంది. మధ్యాహ్నం 2 గంటలకు పట్టభద్రుల పోలింగ్ 46.76 శాతం, ఉపాధ్యాయులు 67.66 శాతం కాగా, సాయంత్రం 4 గంటలకు పట్టభద్రుల స్థానానికి పోలింగ్ 65.28 శాతం, టీచర్ స్థానానికి పోలింగ్ 84.92 శాతం నమోదైంది. ఈ ఎన్నికల్లో టీచర్లు అధిక శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నేడు ఎస్వీ సెట్‌కు..

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పూర్తయిన వెంటనే ఆయా ప్రాంతాల్లోని భద్రతా గదులకు బ్యాలెట్ బాక్సులను తరలించారు. ఎక్కడికక్కడ ఆర్‌డీఓలు ప్రక్రియను పర్యవేక్షించారు. మంగళవారం అన్ని బాక్సులను చిత్తూరు ఎస్వీ సెట్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి తీసుకెళ్లనున్నారు.

నేటి నుంచి సుగుటూరు గంగమ్మ జాతర

- రెండు రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు


సుగుటూరు గంగమ్మ

పుంగనూరు : సుగుటూరు గంగమ్మ జాతర మంగళవారం ప్రారంభంకానుంది. రెండు రోజులపాటు కొనసాగే జాతరను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబసమేతంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. మంగళవారం రాత్రి గంగమ్మకు ఊరేగింపు నిర్వహించి, బుధవారం వేకువజామున ఆలయంలో కొలువుదీర్చనున్నారు. పెద్దసంఖ్యలో తరలిరానున్న భక్తుల కోసం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, పకడ్బందీగా ఏర్పాట్లు చేయించారు. డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపడుతున్నారు.

బోయకొండ హుండీ లెక్కింపు


కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో హుండీలను సోమవారం లెక్కించారు. మొత్తం 85 రోజులకు గాను కానుకల రూపేణా రూ.97.38లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, ఈఓ చంద్రమౌళి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రావణి, ఎక్స్‌అఫిషియో మెంబర్ గంగిరెడ్డి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటింగ్ శాతం	ఉపాధ్యాయ ఓటింగ్ శాతం
ఉ.8-10 వరకు 13.91	ఉ.8-10 వరకు 23.72
మ.12 వరకు 33.64	మ.12 వరకు 50.06
మ.2 వరకు 57.51	మ.2 వరకు 75.12
సా.4 వరకు 79.48	సా.4 వరకు 89.07

బ్యాలెట్‌లో భవితవ్యం!


చిత్తూరు జిల్లా కేంద్రంలోని పీసీఆర్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు ను వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను జిల్లా యంత్రాంగం పకడ్బందీగా నిర్వహించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అవిశ్రాంతంగా పర్యవేక్షించింది. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టింది. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా జాగ్రత్తలు తీసుకుంది. ఈ క్రమంలో పెద్దల సభకు ఎవరిని పంపించాలో ఓటర్లు నిర్ణయించేశారు. శాసన మండలిలో తమ గళాన్ని ఎవరు వినిపించాలో పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటేసి చెప్పేశారు. ప్రజాతీర్పు ప్రస్తుతం బ్యాలెట్‌బాక్సుల్లోకి చేరిపోయింది. కౌంటింగ్ అనంతరం ఫలితం వెల్లడికానుంది.

- ప్రశాంతంగా 'పెద్దల' పోలింగ్
- ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు
- కట్టుదిట్టంగా బందోబస్తు
- పకడ్బందీగా పర్యవేక్షించిన ఎన్నికల అబ్జర్వర్లు, రిటర్నింగ్ అధికారి


ఓటు హక్కును వినియోగించుకున్న కలెక్టర్ హరి నారాయణన్, జేసీ వెంకటేశ్వర్


జీడీనెల్లూరులోని పోలింగ్ కేంద్రం వద్ద డీఐజీ రవిప్రకాష్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్/ చౌడేపల్లె/చిత్తూరు అర్బన్ : ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను అధికారులు సోమవారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు అన్ని కేంద్రాల్లో పోలింగ్ ప్రారంభించారు. ఓటర్లు సైతం ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద పెద్దసంఖ్యలో బారులుతీరారు. పట్టభద్రులు, టీచర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సదుం మండలంలో 86 ఏళ్ల రమాదేవి అనే గ్రాడ్యుయేట్ ఓటేసి ఆదర్శంగా నిలిచారు. రొంపిచెర్ల మండలంలో పెళ్లి కుమారుడు, వెదురుకుప్పం మండలంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు బెంగళూరు నుంచి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పీసీఆర్ జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్ తమ ఓటు వేశారు. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన పోలింగ్‌లో పలువురు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నిఘా నీడలో..

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 22 మంది, టీచర్లకు 8 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఈ క్రమంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు నిఘా నీడన పోలింగ్ నిర్వహించారు. పోలీసులు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద గస్తీ కాశారు. ఓటు హక్కు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతించారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌క్యాస్టింగ్ సెంటర్ నుంచి పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పరిశీలించారు. ఎన్నికల అబ్జర్వర్లు కాటమనేని భాస్కర్, కోన శశిధర్, జేసీ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఐజీ రవి ప్రకాశ్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి విస్తృతంగా పర్యటిస్తూ జిల్లా లోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.

బాక్సుల్లో ఓటు నిక్షిప్తం

పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమయ్యాయి. ఇక ఎవరు విజయం సాధిస్తారనే విషయం ఈ నెల 16వ తేదీన నిర్వహించే కౌంటింగ్‌లో తేలిపోనుంది. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ పూర్తి కాగానే బ్యాలెట్ బాక్సులను చిత్తూరు, నగరి, కుప్పం, పలమనేరు రెవెన్యూ డివిజన్లలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు చేర్చారు. పోలీసు బందోబస్తు నడుమ బ్యాలెట్ బాక్సులను తరలించారు.

ఓటేసిన ప్రజాప్రతినిధులు

పుంగనూరు నియోజకవర్గం సదుంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కుప్పంలోని బాలుర హైస్కూల్‌లో ఎమ్మెల్సీ భరత్ తమ గ్రాడ్యుయేట్ ఓటును వినియోగించుకున్నారు.


కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తున్న రిటర్నింగ్ అధికారి


ఓటు హక్కును వినియోగించుకున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్ చిత్తూరు నగరంలోని కణ్ణన్ పాఠశాల, జీడీనెల్లూరులోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పలమనేరులోని జెడ్పీ హైస్కూల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను ఎస్పీ రిషాంత్‌రెడ్డి సందర్శించారు. డీఎస్పీ శ్రీనివాసమూర్తి చిత్తూరు, పెనుమూరు, గుడిపాల, తవణంపల్లె, జీడీ నెల్లూరు, యాదమరి, ఐరాల, పులిచెర్ల, పూతలపట్టు, రొంపిచెర్ల పోలింగ్ కేంద్రాలను వద్ద బందోబస్తును తనిఖీ చేశారు.

సమస్యలు లేకుండా పోలింగ్

"ఎలాంటి సమస్యలు లేకుండా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగింది. ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు పోలింగ్ సరళిని పర్యవేక్షించాం. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించిన సిబ్బందికి అభినందనలు. ఇక కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం.
– హరినారాయణన్, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్

మేము సైతం

అంధుడికి అభినందనలు



చౌడేపల్లె మండలం కాటిపేరికి చెందిన పట్టభద్రుడు జె. అనంతకుమార్ అంధుడైనా కుటుంబీకుల సహకారంతో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నాడు. తన ఓటు హక్కును వినియోగించుకుని పలువురి అభినందనలు అందుకున్నాడు.

దివ్యాంగులు సైతం



చౌడేపల్లె మండలం చింతమాకులపల్లె పంచాయతీ బయ్యపల్లెకు చెందిన పాళెం చెంగప్ప ,శెట్టిపేటకు చెందిన నాగరత్న దివ్యాంగులైనా పట్టుదలతో వచ్చి ఓటేశారు. బాధ్యతాయుతంగా ఓటు హక్కు వినియోగించుకుని పలువురికి ఆదర్శంగా నిలిచారు.

చంటి బిడ్డతో పోలింగ్ కేంద్రానికి..



చౌడేపల్లె మండలం 29 ఏ చింతమాకులపల్లె పంచాయతీ సర్పంచ్ హైమావతి చంటిబిడ్డతో పోలింగ్ కేంద్రానికి వచ్చారు. తొలిసారిగా తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు బిడ్డతో కలిసి రావడంవ సంతోషంగా ఉందని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు : తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపు తథ్యమని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ గత టీడీపీ పాలనకు నేటి వైఎస్సార్‌సీపీ పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనించారన్నారు. ప్రస్తుతం నిజాయితీగా, పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయని వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రత్యక్షంగా ప్రజలు చూస్తున్నారని, అందుకే టీడీపీ నేతల మాయమాటలను నమ్మడం లేదని వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవలేమని తెలిసి ముందుగానే చంద్రబాబు అండ్‌కో అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సరళిని పరిశీలిస్తే విద్యావంతులైన ఓటర్లు సక్రమంగా తమ నిర్ణయం తీసుకున్నట్లు అర్థమవుతోందని చెప్పారు. ఎల్లో మీడియా అండతో ఎన్ని కుట్రలు పన్నినా టీడీపీ నేతల ఆటలు చెల్లవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యులు కేశవులు పాల్గొన్నారు.

17న మహాకుంభాభిషేకం

తిరుపతి అలిపిరి: చెన్నై నగరంలోని జీఎస్‌చెట్టి వీధిలో టీటీడీ నూతనంగా నిర్మించిన శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో విగ్రహప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 17వ తేదీన మహా కుంభాభిషేకం, ప్రాణప్రతిష్ఠ జరగనుంది. టీటీడీ పాంచరాత్ర ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం విష్వక్సేనారాధన, మృత్సంగ్రహణం, అంకురార్పణతో మహాకుంభాభిషేకం ప్రారంభమయ్యాయని తెలిపారు. తొలిరోజు ఉదయం 7 హోమం, పర్యాగ్నికరణం, అగ్నిమథనం, చతుష్టానార్చన, అగ్ని ప్రతిష్ఠ, మూర్తి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించామని వివరించారు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు చతుష్టానార్చన మూర్తి హోమం, ప్రాయశ్చిత్తం, పూర్ణాహుతి, విమానాధివసం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. చెన్నై స్థానిక సలహా మండలి అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్‌ఈ(ఎలక్ట్రికల్స్) వెంకటేశ్వర్లు, ఈఈ మనోహరం, వీజీఓ మనోహర్, డిప్యూటీ ఈఓలు గుణభూషణ్‌రెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.

చేనేతల సంక్షేమానికి చేయూత


మంత్రి ఆర్కే రోజాను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, చేనేతలు

- మంత్రి ఆర్‌కే రోజా

నగరి : చేనేతల సంక్షేమానికి ఎల్లప్పుడూ చేయూతనందిస్తామని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం నివాసం వద్ద ఏర్పాటుచేసిన నేత సామాజికవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి నేత పరిశ్రమకు తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. నేతన్నలకు ప్రభుత్వ పాఠశాలల యూనిఫామ్ ఆర్డర్లు సైతం ఇప్పించామన్నారు. ఆ ఆర్డర్లే కోవిడ్ కాలంలో కార్మికులకు ఉపాధి కల్పించాయని గుర్తు చేశారు. అత్యాధునిక మరమగ్గాల నిర్వహణలో, నవీన జరీబార్డర్ల చీరల తయారీలో శిక్షణ అందించామని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల నుంచి ఆధునిక యంత్రాలను తెప్పించి వాటి పనితీరుపై అవగాహన కల్పించామని చెప్పారు. తన భర్త సెల్వమణి కూడా నేత సామాజిక వర్గానికి చెందినవారని తెలిపారు. అనంతరం మంత్రి రోజాను నీలమేఘం ఆధ్వర్యంలో నేతన్నలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్ బాలన్, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్ పాల్గొన్నారు.

టీడీపీకి ప్రజాస్వామ్యంపై గౌరవం లేదు


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: టీడీపీ నాయకులకు ప్రజాస్వామ్యంపై గౌరవం లేదని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏకగ్రీవం జరిగినా.. ప్రశాంతంగా ఎన్నికలు జరిగినా గొడవలు సృష్టించడం టీడీపీ నైజం అయిపోయిందన్నారు. శ్రీకాళహస్తి ఎన్నికల పోలింగ్ బూత్‌లను సోమవారం ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఎంతో ఓపిగా ఉండి ఓటుహక్కు వినియోగించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అయినా టీడీపీ నాయకులు దొంగ ఓట్లు పడ్డాయంటూ ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తున్నారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ ఓటమి భయంతో గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ నానాయాగి చేసిందని గుర్తుచేశారు. దొంగ ఓట్లు వేయలేని పరిస్థితి ఉందని తెలిసినా టీడీపీ నాయకులు అదే పనిగా రాద్ధాంతం చేయడం వారి అవివేకానికే వదిలేస్తున్నామని తెలిపారు.

అహోబిల మఠం పీఠాధిపతికి టీటీడీ మర్యాద

తిరుమల: అహోబిల మఠం 46వ పీఠాధిపతి రంగనాథ యతేంద్ర మహాదేశికన్ స్వామిజీకి టీటీడీ శ్రీవారి ఆలయం తరపున సోమవారం మర్యాద చేసింది. శ్రీవారి ఆలయం వద్ద రంగనాథ యతేంద్ర మహాదేశికన్ స్వామిజీకి టీటీడీ అర్చకస్వాములు, ఆలయ అధికారులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామితో పాటు వారి శిష్య బృందం కూడా ఉంది.


శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద అహోబిల మఠం 46వ పీఠాధిపతి రంగనాథ యతేంద్ర మహాదేశికన్ స్వామిజీ

క్లుప్తంగా

ఇంట్లో చోరీ



చంద్రగిరి: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు చొరబడి చోరీకి పాల్పడిన ఘటన మండల పరిధిలోని ఏ.రంగంపేటలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. ఏ.రంగంపేటకు చెందిన రాఘవయ్య శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల్లో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. తన కుటుంబ సభ్యుల బంధువుల వివాహానికి వెళ్లడంతో ఒక్కడే ఉన్న రాఘవయ్య సోమవారం ఉదయం విధుల్లో భాగంగా ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి చేరుకోగానే ఇంటి ఇనుప గేటు తెరిచి ఉండడంతో చూసి లోపలికి వెళ్లాడు. ఇంట్లో తలుపుతో పాటు బీరువాను పగులగొట్టడం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వేలి ముద్రల సేకరణలో నిమగ్నమయ్యారు. బీరువాలో ఉంచిన 13 సవర్ల బంగారు ఆవభరణాలు, రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

చిత్తూరు అర్బన్: నగరంలోని క్రాస్‌లో సోమవారం డీటీఎఫ్ బృందం దాడులు చేపట్టగా కర్ణాటక మద్యం పట్టుబడింది. శంకరయ్యగుంటకు చెందిన అనిల్(23) కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి చిత్తూరు పరిసరాల్లో విక్రయిస్తున్నట్లు సీఐ మాధవస్వామి తెలిపారు. నిందితుడని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

32 ఎర్రచందనం దుంగల పట్టివేత

తిరుపతి అలిపిరి: అన్నమయ్య జిల్లా రాజంపేట అటవీ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం 32 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఎస్పీ కె.చక్రవర్తి ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో ఆర్ఐ చిరంజీవులుకు చెందిన రాఘవేంద్ర టీమ్ అన్నమయ్య జిల్లా సానిపాయ రేంజ్ పింఛా సెక్షన్‌లో కూంబింగ్ చేపట్టారు. అక్కడే జిల్లేళ్ల మంద ఫారెస్ట్ బీట్ పరిధిలో నల్లబండలు, పోరాకనుమల మధ్య కొంతమంది ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వారిని సమీపించడంతో వారు దుంగలను పడేసి పారిపోయారు. ఆ ప్రాంతంలో 19 ఎర్రచందనం దుంగలు లభించాయి. అలాగే ఏఆర్ ఆర్ఐ కే.సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ కే.సురేష్ బాబు టీమ్ ఆదివారం రాత్రి బాలపల్లి రేంజి ప్రాంతంలో 13 ఎరచ్రందనం దుంగలను స్వాధీనం చేసుకుంది. వీటిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించగా, సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్ నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

చంద్రగిరి/చిత్తూరు కార్పొరేషన్ : కుటుంబ కలహాలతో ఓ వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించగా, రైల్వే పోలీసులు కాపాడిన ఘటన సోమవారం జరిగింది. వివరాలు.. తవణంపల్లె మండలం దిగువమాఘం గ్రామానికి చెందిన చంద్రశేఖర్(75) అనే రైతు చంద్రగిరి మండలం ముంగిళిపట్టు సమీపంలోని రైలు పట్టాలపై పడుకున్నాడు. సుమారు 11.40 గంటల సమయంలో తిరుపతి–కాట్పాడి ప్యాసింజర్ రైలు అదే మార్గంలో వస్తోంది. ఇంతలో పట్టాలపై ఉన్న వృద్ధుడిని రైలు డ్రైవర్ గమనించి ఆపేశాడు. జీఆర్పీ జగదీష్‌తో కలిసి వృద్ధుడిని రైలులో ఎక్కించుకుని చిత్తూరుకు తీసుకెళ్లి రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌కు అప్పగించారు. వృద్ధుడి వివరాలు తెలుసుకున్న ఎస్ఐ వెంటనే ఆయన కుటుంబీకులకు సమాచారం అందించారు. రైతు కుమార్తె, కోడలు చిత్తూరు రైల్వే పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. వారికి ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చి వృద్ధుడిని అప్పగించారు.



చంద్రశేఖర్‌ను వారి కుటుంబీకులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

బైక్‌ను ఢీకొన్న లారీ : విద్యార్థి మృతి

పలమనేరు : మండలంలోని పలమనేరు–గుడియాత్తం రహదారిపై టి.వడ్డూరు చెరువు కట్ట మలుపులో సోమవారం రాత్రి బైక్‌ను లారీ ఢీకొనడంతో ఓ విద్యార్థి మృతిచెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. తమిళనాడులోని గుడియాత్తానికి చెందిన కార్తికేయన్ కుమారుడు రాహుల్(21), సైనిగుంటకు చెందిన రజకన్ కుమారుడు సాయి పురుషోత్తమన్ (26) బైక్‌పై పలమనేరుకు వస్తుండగా ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో రాహుల్ తల ఛిద్రమైంది. వెనుక కూర్చున పురుషోత్తమన్ తలకు తీవ్రంగా గాయమైంది. క్షతగాత్రుడిని 108లో పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి రెఫర్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమష్టి కృషితోనే జాతీయ స్థాయి గుర్తింపు



అవార్డు అందుకుంటున్న భావనారెడ్డి

- టీటీడీ జేఈవో సదా భార్గవి
- విద్యార్థులకు అచీవర్ అవార్డుల ప్రదానం

తిరుపతి కల్చరల్: ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర విభాగాల అధికారుల సమష్టి కృషితోనే టీటీడీ విద్యాసంస్థలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని జేఈవో సదాభార్గవి తెలిపారు. మహతి కళాక్షేత్రంలో సోమవారం సాయంత్రం విద్యార్థుల సక్సెస్ మీట్–అచీవర్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలకు ఏ ప్లస్ గ్రేడ్, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలకు ఏ గ్రేడ్, శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించాయని తెలిపారు. టీటీడీ సామాజిక బాధ్యతగా 33 విద్యాసంస్థల్లో 20 వేల మందికి పైగా విద్యార్థులకు విద్యాదానం చేస్తోందన్నారు. అవార్డులు అందుకున్న విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని తమ కిష్టమైన రంగంలో రాణించి అవార్డులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. జాతీయ సంస్కృత వర్సిటీ ఆచార్య కస్పా విశ్వనాథ శర్మ మాట్లాడుతూ నిజాయితీతో కష్టపడితే విజయం సిద్ధిస్తుందన్నారు. టీటీడీ చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేషశైలేంద్ర మాట్లాడుతూ శ్రీకృష్ణార్జునులుగా గురు శిష్యుల సంబంధం ఉండాలన్నారు. టీటీడీ విద్యాశాఖాధికారి ఎం.భాస్కర్‌రెడ్డి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ సమర్థులైన అధికారుల పర్యవేక్షణలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించాలని కోరారు. అనంతరం అకడమిక్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, కల్చరల్, కో కరికులర్, కాంపిటీటివ్ పరీక్షలు, ప్లేస్‌మెంట్స్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 245 మంది విద్యార్థులకు 10 గ్రాములు వెండి డాలర్, ప్రశంసా పత్రంతో అచీవర్ అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



విద్యార్థినికి అవార్డు అందజేస్తున్న జేఈఓ సదాభార్గవి, అతిథులు

భావనారెడ్డికి అచీవర్స్ అవార్డు

తిరుపతి తుడా : పద్మావతి మహిళా కళాశాల హోం సైన్స్ విభాగం నుంచి ఎంపికైన విద్యార్థిని బి.భావనారెడ్డికి సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన కె.విశ్వనాథశర్మ, టీటీడీ జేఈవో సదాభార్గవి, డీఈవో భాస్కర్‌రెడ్డి అచీవర్స్ అవార్డు అందజేశారు.

బూజు పట్టిన బ్రెడ్‌తో చాట్

- దుకాణంపై చర్యలకు కమిషనర్ ఆదేశం

చిత్తూరు అర్బన్: నగరంలోని ఓ చాట్ దుకాణంలో బూజు పట్టిన బ్రెడ్ వినియోగిస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వీడియోలపై మున్సిపల్ కమిషనర్ అరుణ స్పందించారు. వెంటనే దుకాణాన్ని తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. సోమవారం ఈ మేరకు గిరింపేట రిలయన్స్ మార్ట్ వద్ద ఉన్న బాలాజీ చాట్ దుకాణాన్ని ఎంహెచ్ఓ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య తనిఖీ చేశారు. పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెచ్చరించి, దుకాణాన్ని మూయించారు.



దుకాణాన్ని మూయిస్తున్న అధికారులు

విషం తాగి వివాహిత ఆత్మహత్య

చిల్లకూరు: భార్యభర్తల మధ్య ఏర్పడిన చిన్నపాటి మనస్పర్థల కారణంగా ఓ వివాహిత గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం మండలంలోని ఉడతావారిపాల్లపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. ఉడతావారిపాల్లపల్లి గ్రామానికి చెందిన కొండేటి చెంగయ్యకు దూరపు బంధువైన రామమ్మతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వారికి మూడేళ్ల కుమారుడు, 8 నెలల ఆడ శిశువు ఉన్నారు. ఆర్థిక పరిస్థితి గాడితప్పడంతో ఇటీవల చెంగయ్య భార్యకు చెప్పకుండా బయట ప్రాంతాలకు వెళ్లాడు. అప్పటి నుంచి అతను సరిగా ఇంటికి వచ్చేవాడు కాదు. దీంతో రామమ్మ అతనితో వాగ్వాదానికి దిగే క్రమంలో మనస్తాపానికి లోనయ్యింది. ఇంట్లో ఉన్న గడ్డిమందు సేవించి అపస్మారక స్థితికి చేరింది. ఆపై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. తల్లిచాటు బిడ్డలు అనాథలు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎర్రచందనం పట్టివేత



నిందితుడి అరెస్ట్ చూపుతున్న అటవీశాఖ అధికారులు

సోమల: మండలంలోని కందూరు వంక వద్ద కారులో అక్రమంగా తరలిస్తున్న 6 ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అదుపులోకి తీసుకోగా, మిగిలివారు పరారైనట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజర్ వెంకటరమణ తెలిపారు. సీజ్ చేసిన కారుతోపాటు దుంగల విలువ సుమారు రూ.10లక్షలు ఉంటుందన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. దాడిలో సిబ్బంది ప్రతాప్, కుప్పుస్వామి, చరణ్, ప్రభుతేజ పాల్గొన్నట్లు వివరించారు.

మహిళా సర్పంచ్‌పై టీడీపీ నేతల దాడి



సర్పంచ్ మల్లికను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు వైఎస్సార్ సీపీ సర్పంచ్ మల్లిక, ఆమె భర్త గోవిందప్పపై ననియాల గ్రామానికి చెందిన టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి సర్పంచ్ మల్లిక, టీడీపీ నేత గజేంద్ర కుటుంబీకుల మధ్య వాగ్వాదం మొదలై తీవ్ర ఘర్షణకు దారితీసింది. దీంతో సర్పంచ్ మల్లిక, గోవిందప్ప గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కుప్పం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సోమవారం సాయంత్రం బాధితులను ఎమ్మెల్సీ భరత్ పరామర్శించారు. మహిళా సర్పంచ్, ఆమె భర్తపై టీడీపీ నేతలు దాడి చేయడం దారుణమని మండిపడ్డారు. నిందితులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ నేతలు భౌతిక దాడులు చేస్తే దీటుగా సమాధానం ఇస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ, రెస్కో డైరెక్టర్లు రవినాయక్, నాగిరెడ్డి, సర్పంచ్ మోహన్ నాయక్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

చిత్తూరు అర్బన్: ఐరాల మండలం ఇరువారంపల్లె వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న శివకుమార్(41) అనే వ్యక్తిని ఎస్ఈబీ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 32 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, నాగరాజా, సుబ్రమణ్యంగౌడ్, వెంకటేష్, శ్వేత, మమత పాల్గొన్నారు.



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం



అరెస్ట్ చేసిన ముగ్గురితోపాటు, స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ తదితరులు

గూడూరు: తెలంగాణా నుంచి గంజాయిని తీసు కొచ్చి, గూడూరులోని ఓ వ్యక్తికి సరఫరా చేస్తున్న ఇద్దరితోపాటు, గూడూరులో కొనుగోలు చేసి రిటైల్ గా విక్రయిస్తున్న మరో వ్యక్తిని సోమవారం ఎస్ఈబీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక రెండవ పట్టణంలోని జానకీరాంపేట ప్రాంతంలోని ఎస్ఈబీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలోని వరంగల్ జిల్లా, నరసంపేట మండలం, రాజాపల్లి గ్రామానికి చెందిన ఎం స్వరూప, అదే గ్రామానికి చెందిన టీ రాములు తుని, నర్సీపట్నం పరిసర గ్రామాల్లో కిలో గంజాయిని రూ 2,500 చొప్పున కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో వారికి గూడూరు రెండవ పట్టణంలోని దిగువవీరారెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన షేక్‌ఇబ్రహీం కుమారుడు అబ్దుల్ రహీంకు విక్రయించి సొమ్ము చేసు కుంటుంటారు. ఈ క్రమంలో రహీం గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి, రిటైల్‌గా విక్రయించేవాడు. ఈ మేరకు రహస్య సమాచారంతో సోమవారం పోలీసులు దాడిచేశారు. వరంగల్‌కు చెందిన ఇద్దరితోపాటు, కొనుగోలు చేసి విక్రయిస్తున్న గూడూరుకు చెందిన అబ్దుల్ రహీంని అరెస్ట్ చేసి, వారి నుంచి 4 కిలోల గంజాయినీ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈ బీ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ శేషమ్మ కిరణ్‌సింగ్, రమేష్, రాంప్రసాద్, ప్రసాద్, బాషా, రవి, కృష్ణయ్య పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



చిల్లకూరు: మండలంలోని బల్లవోలు నుంచి తూర్పుకనుపూరు వరకు ఉన్న సిలికా గనుల వద్ద గనులశాఖ ఆధ్వర్యంలో సోమవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. బల్లవోలు నుంచి తూర్పుకనుపూరు వరకు సిలికా తవ్వకాలతో సుమారు 30 అడుగుల లోతు గుంతలు ఏర్పడి, నీటితో నిండుగా ఉన్నాయి. తూర్పుకనుపూరులో మంగళవారం నుంచి శుక్రవారం వరకు ముత్యాలమ్మ జాతర జరగనున్న నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో జాతరకు వచ్చే భక్తులు పొరపాటున గుంతలోకి జారి పడి, ప్రమాదాలకు గురి కాకుండా ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

50 మద్యం బాటిళ్ల స్వాధీనం

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు రాజుపాళేనికి చెందిన పల్నాటి తులసీరామ్ నుంచి ఆదివారం అర్ధరాత్రి 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన తులసీరామ్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు రహస్య సమాచారం అందడంతో ఎస్ఐ కృష్ణారెడ్డి తన సిబ్బందితో కలిసి అర్ధరాత్రి దాడులు చేశారు. ఈ దాడుల్లో 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు తులసీరామ్‌ను అదుపులోకి తీసుకున్న కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



పోలీసుల అదుపులో నిందితుడు తులసీరామ్

రెండు వర్గాల ఘర్షణ

- ఇద్దరికి గాయాలు

కుప్పం : మండలంలోని వెండుగంపల్లెలో సోమవారం రెండు వర్గాలు ఘర్షణకు దిగాయి. వివరాలు.. అనిమిగానిపల్లెకు చెందిన మణి తన అనుచరులతో ఓ దుకాణంలో చేపల కూర తినేందుకు వెళ్లాడు. అప్పు ఇవ్వలేదని షాపు యజమాని మంజుతో వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య పాత తగాదాలు ఉన్న నేపథ్యంలో వివాదం ముదిరి ఘర్షణకు దారితీసింది. రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు కత్తులో పరస్పరం దాడులు చేసుకోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. పీఈఎస్ కళాశాలలో మణి, కేసీ ఆస్పత్రిలో మంజు చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.